సాక్షి కాకినాడ

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



ఆదినాయకా... అందుకో మా పూజ

ఆదినాయకా.. అందుకో మా పూజ అంటూ వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే వేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి..


8లో



చోరీ కేసును ఛేదించిన పోలీసులు

చోరీ కేసును తుని పోలీసులు ఛేదించారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వివరాలు వెల్లడించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 4,98,313క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 14,400 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

649 మంది ధ్రువపత్రాల పరిశీలన



సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: తాజా నియామక ప్రక్రియలో పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన 649 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సోమవారం జరిగింది. కాకినాడలోని డీఏఆర్ పోలీస్ మైదానంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియలో ఏపీఎస్పీ (మెన్), సివిల్ (మెన్, విమెన్) అభ్యర్థులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు



గురజనాపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

కరప: పీహెచ్‌సీల పరిధిలో గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్యసేవలందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. మండలంలోని గురజనాపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం కె.శ్రీనివాసరావు (స్టాటిస్టికల్ ఆఫీసర్), జి.గిరిగణేష్ (డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్) సందర్శించి, రికార్డులను, ఆర్‌సీహెచ్, హెచ్‌ఎంఐఎస్ తదితర పోర్టల్స్ తనిఖీ చేశారు. అనంతరం వారు సిబ్బందితో సమావేశమై గర్భిణులకు, పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకుని, చేయాల్సిన విధులపై సూచనలిచ్చారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి సరైన వైద్యం అందించి, సుఖప్రసవాలు జరిగేటట్టు చూడాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ సయ్యద్ ఖతీజా సత్తారి అఫ్రోజ్, సీహెచ్‌ఓ యేసురత్నం, పీహెచ్‌ఎన్ సత్యనారాయణమ్మ, హెచ్‌వీ సీత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో రత్నగిరి కిటకిట



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం సోమవారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత మండపాలు భక్తులతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయం దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భోజనం చేశారు. కాగా ముత్యాల కవచాల అలంకరణలో స్వామి, అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు.

సత్యదేవుని భక్తుల కోసం రెండు హెలికాప్టర్ ఫ్యాన్లు

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి పెద్దాపురానికి చెందిన శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు రూ.నాలుగు లక్షలు విలువ చేసే రెండు హెచ్‌వీఎల్ఎస్ (హై వాల్యూమ్ లో స్పీడ్) ఫ్యాన్లను అందజేయనున్నారు. ఏడు మీటర్లు వ్యాసం కలిగిన ఈ ఫ్యాన్లను హెలికాప్టర్ ఫ్యాన్లుగా పిలుస్తారు. సోమవారం ఆలయానికి వచ్చిన దాత సత్యప్రసాద్ వారం రోజుల్లో వార్షిక కల్యాణ మండపంలో భక్తుల కోసం ఈ ఫ్యాన్లను అమర్చనున్నట్లు అధికారులకు తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి

పిఠాపురం: డీఎస్సీ సాధించిన వారి ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అబ్జర్వర్, ఏపీ విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వ రామలింగం తెలిపారు. ఆయన సోమవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డీఎస్సీ సాధించిన వారి ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ అధికారులు, విద్యార్హత సర్టిఫికెట్లను విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్లో పొందుపరిచిన జాబితా ప్రకారం ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి ఉద్యోగ అర్హత నిర్ణయిస్తామని చెప్పారు. ఆయన వెంట ఆర్డీడీ నాగమణి, డీఈవో రమేష్ డీసీఈబీ వెంకట్రావు ఉన్నారు.

ఇదేం భూగోతం



మండల కేంద్రం కరపలో లే అవుట్‌లో గ్రావెల్‌తో మెరక పనులు



సొమ్ము ఇచ్చాకే కరపలో సిద్ధం చేసుకుంటున్న లే అవుట్

- ఎకరా కన్వర్షన్‌కు రూ.3 లక్షలు ఇవ్వాల్సిందే..
- లేకుంటే నో పర్మిషన్
- ముఖ్యనేతకు ముడుపుల మూట
- సొంత పార్టీ అయినా ససేమిరా..
- పేట్రేగిపోతున్న కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. తన, తమ భేదం లేకుండా ఎవరైనా పైసలు ఇవ్వందే పని కాదంటున్నారు. పై నుంచి కింది వరకు నేతలందరిదీ ఒకటే దారి అన్నట్టుగా ఉంది. మట్టి, గ్రావెల్, ఇసుక, లిక్కర్‌తోనే సరిపెట్టకుండా రియల్టర్లను కూడా విడిచిపెట్టడం లేదు. జిల్లా కేంద్రం కాకినాడ నగరానికి నాలుగుపక్కలా ఉన్న కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జనసేన నేతలు రియల్ దందా మూడు ప్లాట్‌లు, నాలుగు లే అవుట్‌లుగా నడుస్తోంది. లే అవుట్ వేయడమే పాపం అన్నట్టు లక్షలు మెక్కేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు పెట్టి సొమ్ము ఇస్తేనే సై అంటున్నారు. అన్నంత ఇవ్వకుంటే లే అవుట్లను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఈ విషయంలో సొంత పార్టీ నేతలను సైతం విడిచిపెట్టడం లేదు. కాకినాడ రూరల్, కరప మండలాల్లో జరుగుతోన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం నియోజకవర్గ ముఖ్యనేతకు కాసులు కురిపిస్తోంది. చివరకు సొంత వ్యవసాయ భూమిని ప్లాట్‌లుగా అమ్ముకుందామన్నా కూడా కప్పం కట్టాల్సిందేనని పంతం పట్టిమరీ వసూళ్లకు తెగబడుతున్నారు. ఈ రియల్ దందా అంతా కాకినాడ పరిసర ప్రాంతాల్లో సినిమేటిక్‌గా జరుగుతోంది.

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలోకి వచ్చే రూరల్ నియోజకవర్గం లే అవుట్లకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ నియోజకవర్గానికి జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం అటు కోనసీమ, ఇటు తూర్పుగోదావరి జిల్లాల్లోని నగరాలు, పల్లెల నుంచి కాకినాడ నగరానికి వలసలు పెరుగుతూ వస్తున్నాయి. ఏటా పెరుగుతూ వస్తున్న నగర జనాభా ప్రస్తుతం నాలుగున్నర లక్షల పైమాటే. వలసలు వచ్చే కుటుంబాలతో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు కాకినాడ నగరంలో నివాసం పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కాకినాడ నగరానికి ఆనుకుని ఆరేడు కిలోమీటర్ల వరకు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మారుతున్నాయి.

ఈ భూములను రియల్టర్లు కొనుగోలు చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. ఎకరాల్లో భూములు కొనుగోలు చేసి లేఅవుట్‌లు చేసి గజాల్లో విక్రయిస్తున్నారు. ఈ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేసే సమయంలో నియోజకవర్గ ముఖ్యనేత అనుచరులు ఆ భూముల్లో గద్దల్లా వాలిపోతున్నారు. రియల్టర్లతో బేరసారాలకు తెరతీస్తున్నారు. అనుకున్నట్టు గానే పంతం పట్టి కప్పం కట్టించుకుంటున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు నిర్ణయించి జనసేన నేతలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అది సొంత పార్టీ అయినా.. కూటమి నేతలైనా నియోజకవర్గ ముఖ్యనేత అనుచరులు మాత్రం విడిచిపెట్టడం లేదు. లే అవుట్ వేస్తే కప్పం కట్టాల్సిందేనంటున్నారు. లేదంటే అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి భూ బదలాయింపు (కన్వర్షన్)కు అనుమతులు ఆపేస్తున్నారు. మండల కేంద్రమైన కరప, పెనుగుదురు, నడకుదురు, కాకినాడ రూరల్ తూరంగి, చీడిగ తదితర ప్రాంతాల్లో వేస్తున్న వెంచర్లలో ఎకరాకు రూ.3 లక్షల వంతున బలవంత వసూళ్లకు తెగబడుతున్నారు.

కీలక నేత కనుసన్నల్లోనే...

నియోజకవర్గ ముఖ్యనేత కనుసన్నల్లోనే ఈ రియల్ దందా అంతా సాగుతోంది. అధికారం చేతిలో ఉందనే ధైర్యంతో అతని అనుచరులు బరితెగించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల మండల కేంద్రం కరపలో జనసేన నాయకుడు వేసిన లే అవుట్‌ను కూడా విడిచి పెట్టలేదు. ఒకప్పుడు అన్నవరం దేవస్థానం సభ్యుడిగా పనిచేసిన ఆ నాయకుడు తాను జనసేనకే పనిచేశానని, ఆ భూమి తన సొంతమని ఎంత మొత్తుకున్నా జనసేన నేతలు పెడచెవిన పెట్టారు. 26 ఎకరాల లే అవుట్‌లో ఎకరాకు రూ.3 లక్షలు వంతున కప్పం కట్టాలని పంతం పట్టారు. ఇందుకు ఆ నాయకుడు ససేమిరా అనడంతో అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చి లేఅవుట్‌లో మెరకచేసే పనులను ఆపేయించారు. రెండు వారాల పాటు పనులు ఆపేసిన సంబంధిత రియల్టర్ కం జనసేన ఫాలోవర్ చివరకు చేసేదేమీ లేక వారు పంతం పట్టినంతా కప్పం కట్టేసి నిలిచిపోయిన లే అవుట్ పనులు మొదలుపెట్టారు. ఆ ఒక్క లే అవుట్‌లోనే సుమారు అరకోటి ముడుపు మూటకట్టి నియోజకవర్గ ముఖ్యనేతకు చెల్లించుకున్నారు. ఇదే విషయం ఇటీవల కరప మండలంలో జరిగిన తెదేపా మండల స్థాయి నేతల సమావేశంలో చర్చకు రావడం గమనార్హం. సొంత పార్టీ వారు లే అవుట్‌లు వేసుకున్నా వదలకుండా జలగల్లా పట్టి పీడించుకు తింటే ఎలా అని తెదేపా సీనియర్ నేతలు నిలదీశారని తెలియవచ్చింది. ఎక్కడైనా లే అవుట్ వేస్తున్నారంటే ముందుగానే ఎకరాకు రూ.3 లక్షలు ఇస్తామనే ఒప్పందం చేసుకుని అడ్వాన్స్ ముడుపు ముట్టజెప్పాల్సిందే. ముఖ్యనేత చేతిలో సొమ్ము పడితేనే లే అవుట్‌కు అధికారులు అనుమతుల ప్రక్రియ మొదలుపెడతారు. నియోజకవర్గ మంతటా ఇదే దందా నడుస్తోంది. కాకినాడ రూరల్ తూరంగి, చీడిగ, కొవ్వాడ, గంగనాపల్లి, పండూరు, పి.వెంకటాపురం, పెనుమర్తి, తిమ్మాపురం తదితర గ్రామాల్లో సైతం ఇదే రియల్ దందా నడుస్తోంది. ఎకరాకు వసూలు చేస్తున్న కప్పం రూ.3 లక్షల్లో రెండు వంతులు అంటే రూ.2 లక్షలు నియోజకవర్గ ముఖ్యనేతకు మిగిలింది స్థానిక నేతలు పంచుకుంటున్నారు. ఈ ముడుపులు చెల్లించలేక రియల్టర్‌లు బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం వస్తే ఏదో డబ్బు వెనకేసుకోవచ్చనే ఆశ అడియాశ చేశారని రియల్టర్లుగా మారిన కూటమి నేతలు మండిపడుతున్నారు. తమ ప్రభు త్వం వచ్చిందనే సంతోషం కూడా లేకుండా చేశారంటున్నారు. కనీసం తమకైనా మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్ కూటమి సమావేశం ముందుంచాలని రియల్టర్లు అయిన కూటమి నేతలు సిద్ధపడుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు 631 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బోట్‌క్లబ్(కాకినాడ): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, డీఆర్వో జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, సీపీవో పి.త్రినాథ్, జీజీహెచ్ ఎస్సీసీ ఎన్ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి హాజరై జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, విన్నపాలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు, చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్ కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం, ఆన్‌లైన్ సమస్యలు వంటి అంశాలకు సంబంధించి మొత్తం 631 అర్జీలు అందాయి. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పరిష్కరించిన దరఖాస్తులను జిల్లా అధికారి ఆడిటింగ్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్ర స్థాయిలో ఆడిట్‌కి పంపించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలంటూ ధర్నా



హామీలు అమలు చేయాలంటూ కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న రజక సంఘాల ప్రతినిధులు

బోట్‌క్లబ్ (కాకినాడ): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు రజకులకు ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద రజక వృత్తిదారుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తరతరాలుగా వెనుకబడి ఉన్న రజక వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ ఎంతో కష్టపడి తమ పిల్లలను చదివించినా సరైన ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. అందువల్ల ఆసుపత్రి, రైల్వే, ఆర్టీసీ, పోలీస్ శాఖల్లో రజకులకు కేటాయించిన పోస్టులను వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వృత్తి ద్వారా 50 ఏళ్లకే అనారోగ్యానికి గురై బాధపడుతున్నామని, ఆ వృత్తిదారులకు పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు.

పిఠాపురం అగ్రహారంలో ఉన్న దోబీఘాట్‌లో తరతరాలుగా వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్నామని అది శిథిలస్థితికి చేరిందని తక్షణమే మరమ్మతులకు నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

రజకులకు ఇచ్చిన హామీల్లో 250 యూనిట్లు ఉచిత కరెంటు, రజకులకు శాశ్వత నివాస ధ్రువ పత్రాలు, వృత్తిదారులకు రూ.5 లక్షల రుణాల ఇచ్చి దానిపై 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోనేటి రాజు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వృత్తిదారులు సీహెచ్ శ్రీనివాస్, కొడమంచిలి అప్పన్న, దుమరసింగు దుర్గ, సామంతకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామి



లక్ష బిల్వార్చన చేస్తున్న వేద పండితులు

పిఠాపురం: ప్రముఖ దత్త పుణ్యక్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా పిఠాపురంలో ఆరవ రోజు సోమవారం లక్ష బిల్వార్చన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఏకాంత సేవ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీవల్లభ సప్తాహ మహోత్సవాల్లో ప్రతి రోజు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సౌజన్య తెలిపారు. స్వామివారికి విశేష అలంకారం చేయగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవల్లభ సప్తాహ మహోత్సవాల సందర్భంగా మరాఠీ భక్తులు పోటెత్తారు. 10 వేల మంది మహారాష్ట్ర భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ర్యాలీ

1500 మందితో భారీ ర్యాలీ



సమస్యలు పరిష్కరించాలంటూ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బోట్‌క్లబ్: విద్యారంగంలోని సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చెరువు సెంటర్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు 1500 మందితో భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగా సూరిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం చూస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా తయారయిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్య మొత్తం కేంద్రీకరణ, కాషాయీకరణ, ప్రైవేటీకరణ అవుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోను పూర్తిగా అమలు చేయనటువంటి నూతన జాతీయ విద్యావిధానాన్ని మన రాష్ట్రం అమలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యారంగాన్ని సమూలంగా మార్పులు చేస్తామని, చెప్పి నేడు ఎటువంటి మార్పులు లేకుండా గత ప్రభుత్వం చేసిన విధానాల్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదన్నారు. దీని వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో చదువుకున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం వేయక, విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకుండా, విద్యార్థులు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యాసంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ హాస్టల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పినటువంటి ఈ ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో ఉంటూ అరకొర సౌకర్యాలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారని 2018లో ఇచ్చిన మెనూనే, నేటికీ అమలు చేయాలని చెప్పేటువంటి ఈ ప్రభుత్వం, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.3 వేలకు పెంచాలని, విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్ చార్జీలు ప్రతి నెల ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గొల్లప్రోలు, ఉప్పాడ, కొత్తపల్లి, ప్రత్తిపాడు, కోటనందూరు మండలాల్లో జూనియర్ కళాశాలలకు భవనాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్‌కు శాశ్వత భవనాలు లేక అద్దె భవనాల్లో ఉంటూ బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు కొనసాగుతున్నాయని విమర్శించారు. కాకినాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ హాస్టల్‌కు గత మూడేళ్ల నుంచి నూతన భవనం నిర్మిస్తున్నామని చెప్పి, నేటికీ భవనం పూర్తయినా ప్రారంభించకుండా జిల్లా అధికారులు ఇతర కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్నారన్నారు. అనంతరం దాదాపు 54 సమస్యలను గుర్తించి వినతి పత్రాన్ని జేసీ రాహుల్ మీనాకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు సిద్ధూ, సాహిత్, వాసుదేవ్, నాగరాజు, మణికంఠ, ఉదయ్‌కుమార్, జయరాం, సత్యం, చిన్ని, గోపాలకృష్ణ, రవి, నాని, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

7న సత్యదేవుని దర్శన వేళల్లో మార్పులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుని ఆలయంలో భాద్రపద పౌర్ణిమ, సెప్టెంబర్ ఏడో తేదీ రాత్రి 9–50 గంటలకు ఏర్పడనున్న చంద్రగ్రహణం కారణంగా ఆ రోజు స్వామివారి దర్శన వేళల్లో మార్పులు చేసినట్లు ఈఓ వి.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ ఆదివారం ఉదయం పది గంటల వరకు మాత్రమే స్వామివారి వ్రతాలు, కేశఖండన టిక్కెట్లు విక్రయిస్తారు. స్వామివారి సర్వ దర్శనానికి భక్తులను మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే అనుమతిస్తారు. అనంతరం ఆలయం మూసివేస్తారు. సెప్టెంబర్ ఎనిమిదో తేదీ సోమవారం ఆలయం సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను వ్రతాలు, దర్శనాలు, ఇతర పూజా కార్యక్రమాలకు అనుమతిస్తారు.

మహిళ, ఆమె కుమారుడి అదృశ్యం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఓ వివాహిత, ఆమె కుమారుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్టి ప్రియకుమారి, ఆమె రెండేళ్ల కుమారుడు శేషగిరితో కలసి ఈనెల 23న ఇంటి నుంచి బయలుదేరి కోరుకొండ వెళ్లింది. అప్పటి నుంచి వారిద్దరి ఆచూకీ తెలియలేదు. దీనిపై భర్త రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. వీరి ఆచూకీ తెలిసిన వారు 94409 04830, 94409 04829 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఆదినాయకా... అందుకో మా పూజ

- రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు
- ఉమ్మడి జిల్లాలో ముస్తాబైన ఆలయాలు, ఉత్సవ మంటపాలు
- ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 4 వరకూ వేడుకలు



చవితికి ముస్తాబైన అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయం

అయినవిల్లి: ఆదినాయకా.. అందుకో మా పూజ అంటూ వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే వేడుకలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి.. ఇప్పటికే ఉత్సవ మంటపాల ఏర్పాటుకు అన్నీ ఏర్పాట్లూ చకచకా జరిగిపోతున్నాయి. ప్రసిద్ధి చెందిన అయినవిల్లి సిద్ధి వినాయకుని ఆలయం చవితి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా సిద్ధమైంది. బుధవారం వినాయక చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు విఘ్నేశ్వరుని సన్నిధిలో వేడుకలు నిర్వహించనున్నారు. దీని కోసం ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. గతేడాది కంటే అధికంగా భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ వర్గాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వివిధ రంగులతో ఆలయ గోపురాన్ని తీర్చిదిద్దారు. ప్రత్యేక పుష్పాలు, కొబ్బరి, అరటి ఆకులు, కూరగాయలు వంటి వాటితో ఆలయ ప్రాంగణంలో అలంకరిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి చెప్పారు.

తొమ్మిది రోజులు.. ప్రత్యేక అభిషేకాలు

వినాయక చవితి సందర్భంగా బత్తాయి, దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, మామిడి వంటి వివిధ సీజనల్ పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేయనున్నారు. అనంతరం లక్ష గరిక పూజ, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, హారతులు తదితర కార్యక్రమాలు తొమ్మిది రోజుల పాటు ఉంటాయని ఏసీ వెంకట దుర్గాభవాని తెలిపారు. ఈ రోజుల్లో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేస్తామన్నారు. చవితి రోజున సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆలయ ప్రాంగణం వెలుపల మండపంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయం తెరుస్తారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అన్ని ఏర్పాట్లూ చేశాం..



అయినవిల్లి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. చవితి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తాం. నవరాత్రుల్లో ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

–అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ ఈఓ, అయినవిల్లి

మేలుకొలుపు సేవ తదితర పూజల అనంతరం ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12 గంటలకు నిత్య గణపతి హోమం, ఒంటి గంటకు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, ప్రసాద నివేదన కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం నాలుగు గంటలకు స్వామివారిని మూషిక వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు పంచ హారతులు ఇస్తారు. రాత్రి ఎనిమిది గంటల వరకూ ఆలయం తెరిచి ఉంటుందని ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు తెలిపారు.

చెవిలో చెబితే.. కోర్కెలు తీర్చే స్వామి



బిక్కవోలులో గణపతి ఆలయ ముఖ ద్వారం

బిక్కవోలు: చెవిలో చెబితే కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పేరొందిన బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఆలయం చవితి వేడుకలకు ముస్తాబైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఈ ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది. 1,100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం కావడంతో చవితి ఉత్సవాలకు ఇక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ శ్రీలక్ష్మీగణపతి స్వామి ఏకశిలా మూర్తిగా దర్శనమిస్తారు. స్వామి విగ్రహం 10 అడుగుల పొడవు 6 అడుగుల వెడల్పున ఉంటుంది. స్వామివారికి తొండం కుడి వైపునకు తిరిగి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఈ విగ్రహం తూర్పు చాళుక్యుల కాలం నాటిదని పురావస్తు శాఖ అంచనా వేసింది. స్వామివారి చెవిలో తమ కోర్కెలు చెబితే తీరతాయనేది భక్తుల నమ్మకం. వినాయక చవితి సందర్భంగా గణపతి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి గణపతి నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి దాటాక బుధవారం తెల్లవారు జామున 1.58 గంటలకు తీర్థపు బిందె సేవతో స్వామివారి చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం ఉదయం 11.04 కలశ స్థాపన చేశారు. ఈ వచ్చే నెల 6న మహాన్నదానంతో ఉత్సవాలు పూర్తవుతాయి.



బిక్కవోలు ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

గతేడాది కంటే ఘనంగా..



ఆలయం చుట్టుపక్కల అంతా రేకుల షెడ్డు ఏర్పాటు చేశాం. గత ఏడాది కంటే ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ క్యూలైన్లు నిర్మించాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి చవితి రోజు మినహా మిగిలిన రోజుల్లో అన్నదానం ఉంటుంది.

–ఎ.భాస్కర్, దేవదాయ శాఖ ఈఓ, బిక్కవోలు గ్రూప్ ఆలయాలు



బిక్కవోలులో గణపతి స్వామివారు

మోటారు సైక్లిస్ట్‌పైకి దూసుకెళ్లిన ఆబోతులు

చికిత్స పొందుతూ మృతి



జంగా రామకృష్ణ (ఫైల్)

అల్లవరం: రెండు ఆబోతులు పొట్లాడుకుంటూ దారిని పోతున్న వ్యక్తిపైకి దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన అతను మృతి చెందిన సంఘటన అల్లవరం మండలం గుండెపూడిలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... గుండెపూడి పోతులవారిపేట గ్రామానికి చెందిన జంగా రామకృష్ణ (41) గురువారం రాత్రి దేవగుప్తం సెంటర్ నుంచి మోటారు సైకిల్‌పై పోతులవారిపేట వెళ్తుండగా గుండెపూడిలోని ఆంజనేయస్వామి వారి ఆలయాలకు సమీపంలో రోడ్డుపై రెండు ఆబోతులు హోరాహోరీగా పోట్లాడుకుంటున్నాయి. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న రామకృష్ణపైకి రెండు ఆబోతులు దూసుకువచ్చాయి. దీంతో రామకృష్ణ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. సయమానికి ఎవరూ లేకపోవడంతో రామకృష్ణపై ఆబోతులు వీరంగం సృష్టించి మరింత గాయాలు పాల్జేశాయి. కొద్ది సేపటికి రోడ్డుపై పడి ఉన్న రామకృష్ణను స్థానికులు గుర్తించి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలైన రామకృష్ణ తలకు శస్త్రచికిత్స చేశారు. అయితే ఆదివారం సాయంత్రం అతను మృతి చెందారు. ఈ ఘటనపై అల్లవరం ఎస్సై సంపత్‌కుమార్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు.

గొడవను అడ్డుకోబోతే గొంతు కోసేశాడు

రాజానగరం: ఇద్దరు వ్యక్తులు గొడవపడి, కొట్లాటకు దిగడంతో వారిని సముదాయించే ప్రయత్నం చేస్తూ, ప్రాణాల మీదకు తెచ్చుకున్న వ్యక్తి ఉదంత మిది. రాజానగరం నడిబొడ్డున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక ముత్యాలమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన గొల్ల సాయి, అగత్తి సాయి అనే ఇద్దరు గొడవపడి, కొట్టుకున్నారు. గుడి వద్ద వినాయక చవితికి సంబంధించిన డెకరేషన్ పనులు చేస్తున్న నీలం లక్ష్మీప్రసాద్ దీనిని గమనించి, వారిద్దరినీ విడిపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో గొల్ల సాయి తన వద్ద ఉన్న చాకుతో అతని గొంతును కోశాడు. దీంతో రక్తపు మడుగులో పడిఉన్న లక్ష్మీప్రసాద్‌ను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. ప్రస్తుతం అతనికి ఆస్పత్రిలో చికిత్స జరుగుతుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.ప్రియకుమార్ తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

తుని: చోరీ కేసును తుని పోలీసులు ఛేదించారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన సతీష్ (అవంతికరెడ్డి) మూడేళ్ల కిందట తుని వచ్చి హిజ్రాలతో కలసి జీవిస్తున్నాడు. ఆడ లక్షణాలు కలిగిన సతీష్ మహిళ వేషధారణలో స్థానిక జాతీయ రహదారిపై ఉంటూ పలువురిని ఆకర్షిస్తూ డబ్బులు సంపాదించేవాడు. పండగలు, జాతర్లలో నృత్యాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సతీష్‌కు ఇన్‌స్టాగామ్‌లో ప్రశాంత్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. వీరిద్దరూ తుని పట్టణం 10వ వార్డు నిమ్మకాయలవారి వీధిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. సతీష్ తనను పెళ్లి చేసుకోవాలని ప్రశాంత్‌ను కోరాడు. ఆపరేషన్ చేయించుకుని పూర్తి హిజ్రాగా మారితేనే పెళ్లి చేసుకుంటానని ప్రశాంత్ చెప్పాడు. దీంతో ఆపరేషన్‌కు రూ. 5 లక్షలు అవసరమని తెలుసుకున్న సతీష్, ప్రశాంత్‌లు చోరీకి వ్యూహరచన చేశారు. వారు నివాసం ఉంటున్న ఇంటి పక్కనే నివాసం ఉంటున్న బాలేపల్లి సత్యవతి అనే వృద్ధురాలిని టార్గెట్ చేశారు. ఈ నెల 20న ఆమె తన ఇంటి వెనుక భాగంలో ఉండగా, అప్పటికే అక్కడ మాటు వేసిన సతీష్, ప్రశాంత్‌లు ఆమె కళ్లలో కారం కొట్టారు. వృద్ధురాలి మెడలో ఉన్న ఐదు గ్రాముల పగడాల బంగారు గొలుసుతో పాటు చేతికున్న నాలుగున్నర తులాల బంగారు గాజులను తీసుకుని పరారయ్యారు. సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ సీఐ గీతారామకృష్ణ సమగ్ర దర్యాప్తు జరిపి ఆదివారం స్థానిక రైల్వే గెస్ట్ హౌస్ వద్ద నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 7 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ గీతారామకృష్ణ, ఎస్సైలు విజయ్‌బాబు, పాపారావు, సిబ్బంది యాదవ్, శివయ్య, నాయుడులను డీఎస్పీ అభినందించారు.



తునిలో చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

బాలికను మోసగించిన ఇద్దరిపై కేసు

రాజమహేంద్రవరం రూరల్: ఓ బాలికను మోసగించిన ఘటనలో ఇద్దరిపై బొమ్మూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. స్థానిక దివాన్‌చెరువుకు చెందిన ఓ బాలిక (14) ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి అక్కడే ఓ కర్రి పాయింట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బాలిక తల్లి పనిచేసే కర్రి పాయింట్‌కు తరచూ వెళ్లేది. అక్కడ పని చేసే పాండా రవికుమార్ తల్లి లేని సమయంలో బాలిక ఇంటికి వెళ్లి ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని గత ఏడాది డిసెంబర్‌లో లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొద్ది రోజుల తర్వాత 16 ఏళ్ల బాలుడిని తన సోదరుడిగా పరిచయం చేశాడు. ఈ ఏడాది జనవరి నుంచి ఆ బాలుడు కూడా ఆమె ఇంటికి వెళ్లి కోరిక తీర్చాలని, లేకపోతే రవికుమార్‌తో ఉన్న సంబంధాన్ని బయట పెడతానని లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భవతి అయ్యింది. ఆదివారం బాలికకు గర్భవిచ్ఛిత్తి కావడంతో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేల్ నర్సుపై సస్పెన్షన్ వేటు



మోకా సందీప్

కాకినాడ క్రైం: ఓ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనలో కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న మేల్ నర్స్ మోకా సందీప్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సందీప్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సోమవారం సందీప్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. విధులకు మద్యం తాగి రావడం, బాధ్యతాయుతమైన నర్సు విధుల్లో పనిచేస్తూ ఓ మహిళ నగ్న ఫొటోలు ఆమెకు తెలియకుండా తీయడం, వాటిని అడ్డుపెట్టి బ్లాక్‌మెయిల్ చేయడం, బాధితురాలిని కొట్టి అఘాయిత్యానికి పాల్పడడం, ఆ ఫొటోలను ఆమె కుమారుడికి పంపడం తద్వారా ఆ బాలుడిని ఆత్మహత్యకు పురిగొల్పడం అంశాలు ఎఫ్ఐఆర్‌లో పొందుపరచడంతో అవే అంశాల ప్రాతిపదికన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడన్న సహ మేల్ నర్సుల ఫిర్యాదుతో అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. ఎక్కువ రోజులు సెలవులో ఉంటున్న సందీప్‌కు అసలు అన్నాళ్లు సెలవు ఎవరు ఇస్తున్నారు, అలాగే సందీప్‌కు సహాయకారిగా ఉంటూ అతడి సెలవు దరఖాస్తులను అధికారులకు ఎవరు అందిస్తున్నారనే అంశాలపై విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

నిద్రపోతూ తమిళనాడు వాసి మృతి

కరప: బతుకు దెరువు కోసం బెల్లం వ్యాపారం చేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు వ్యాన్‌లో నిద్రిస్తూ మృతి చెందిన ఘటన కరప మండలం పెనుగుదురు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా మండల కేంద్రమైన అయ్యనరుతు గ్రామానికి చెందిన వెలువెత్తు మురుమత్తు, ముత్తు, అల్విన్, పెరుమళ్ల ముత్తయ్య పెరుమాళ్లు వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ తాటిబెల్లం కుందులు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ బెల్లం వ్యాపారం చేస్తున్నారు. ఇలా పెనుగుదురు గ్రామానికి వచ్చిన సదరు తమిళులు చుట్టుపక్కల గ్రామాల్లో బెల్లం అమ్మి రాత్రి 8 గంటల సమయంలో పెనుగుదురులోని పెట్రోల్ బంక్ వద్ద బొలెరో వ్యాన్ పెట్టి, నలుగురు కలసి మద్యం తాగి, భోజనం చేసి వ్యాన్‌లో నిద్రపోయారు. ఇందులో ఒకరు పెరుమాళ్ల ముత్తయ్య సోమవారం ఉదయం 5 గంటల సమయంలో టీ పట్టుకొచ్చి వెలుముత్తు మురుమత్తును లేపినా లేవలేదు. వెంటనే అతడిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ముత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదుచేశారు.

మొక్కలు నరికేశారని ఫిర్యాదు

రాజానగరం: మండలంలోని కానవరంలో తన పదెకరాల్లో నాటిన పామాయిల్ మొక్కలను కత్తులతో మొదళ్ల వరకు నరికించి, తీవ్ర నష్టం కలిగించారని దివాన్‌చెరువుకు చెందిన వంక మల్లికార్జున స్వామి (మల్లిబాబు) స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన సంగిశెట్టి వీరవెంకట్రావు, అతని అనుచరులతో ఆదివారం రాత్రి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడన్నారు. తనకు వీరవెంకట్రావుతో కొంతకాలంగా నడుస్తున్న వివాదాలను ప్రస్తావిస్తూ, వాస్తవాలను పరిశీలించి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



పామాయిల్ మొక్కలను నరికేసిన దృశ్యం

లారీ ఢీకొని మహిళ మృతి

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. సర్పవరం పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ డెయిరీ ఫామ్ సెంటర్‌కు చెందిన వెంకటరత్నం (51) తన భర్త సత్యనారాయణతో టీవీఎస్ మోపెడ్‌పై వాకలపూడిలోని కోరమాండల్ ఆస్పత్రిలో వైద్యం కోసం బయలుదేరారు. వలసపాకల గ్రామం గంగరాజునగర్‌లో సూర్య కార్ వాష్ వద్దకు వచ్చేసరికి వెనక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఇద్దరూ కింద పడిపోయారు. వెంకటరత్నంపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.